# పృథ్వీ

తల్లీతండ్రిలేని కుమార్‌ని ఎంతో క్రమశిక్షణతో పెంచేడు తాతగారు.

తాతగారి పెంపకంలో చదువులో చురుకుగా పైకొచ్చాడు కుమార్.

కుమార్‌కి అన్నీ మంచి అలవాట్లే! కాఫీ తాగడు. సిగరెట్టు ముట్టుకోడు. సినిమాలు చూడడు. ఫ్రెండ్సు లేరు.

కుమార్ దృష్టి ఎప్పుడూ చదువుమీద... వున్నతమైన భవిష్యత్‌మీదే వుంటుంది.

డిగ్రీ పూర్తి అయ్యేలోగానే క్రికెట్‌లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. చెస్ ఆటలో గుర్తింపు వుంది. రోజూ టెన్నిస్ ఆడటం కుమార్‌కి అలవాటు.

తల్లితండ్రులు లేని లోటు రానివ్వకూడదనే భావనతో కుమార్‌కి ఏది కావాలంటే అది ఇచ్చాడు తాతయ్య.

ఆ తాతయ్య పేరు పృథ్వీ! ఈయనకు ఇద్దరే సంతానం. ఒక ఆడపిల్ల, ఒక మగబిడ్డ! ఇద్దరూ విద్యాధికులే.

ఆడపిల్లని చదివించి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేడు. అల్లుడు అమెరికాలో డాక్టరు.

కొడుకు రాత్రి పగలు అనే తేడా లేకుండా తాగడం, రోజుకి పది పాకెట్లకు పైగా సిగరెట్లు వూదిపారేయడం చూస్తూ పృథ్వీ మనస్సు ఆందోళనపడసాగింది. ఇలా అయితే కొడుకు భవిష్యత్ ఏంగాను అనేసి నిత్యమూ వాపోయేవాడు.

ఆరోజు రాత్రి సీసాను గ్లాసుని విడిచిపెట్టకుండా ఇంకా... ఇంకా... తాగుతూనే వున్నాడు భరద్వాజ్ - అర్ధరాత్రి దాటేక బెడ్‌మీద వాలిపోయాడు.

తెల్లవారేక నిద్రలోనే ఆఖరిశ్వాస విడిచిన భరద్వాజ్‌ని చూచి తండ్రిభార్య ఘొల్లుమన్నారు.

గుండెపోటు తీవ్రస్థాయిలో వచ్చిన కారణంగా భరద్వాజ్ ప్రాణం పోయిందన్న సంగతి విన్న పృథ్వీ కొయ్యబారిపోయాడు.

కడుపున పుట్టిన చెట్టంత కొడుకు పోయాడన్న దిగులు తీరకముందే కోడలి ఆత్మహత్య పృథ్వీ జీవితానికి గొడ్డలిపెట్టే అయింది.

కొడుక్కి గుండెపోటు కారణమైతే కోడలు నిద్రమాత్రలు మింగి, వైధవ్యాన్ని భరించడం ఇష్టంలేక ప్రాణాన్ని బలవంతంగా తీసుకుంది.

రెండేళ్ళయినా నిండని కుమార్ దిక్కులేనివాడు కాకూడదని నిర్ణయించుకున్న పృథ్వి... మనుమడికి సర్వం తానే అయి పెంచాడు.

తండ్రి అలవాట్ల నీడ కుమార్ మీద పడకూడదని పెంపకం విషయంలో అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు పృథ్వి.

పృథ్వికి ఇప్పుడు డెబ్బై ఏళ్ళు! పళ్ళూడలేదు. కంటిచూపు మందగించలేదు.

కుమార్ ని ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ చేయాలని ఎంతో ఆరాటపడ్డాడు పృథ్వి.

కానీ... తాను పోలీసు ఆఫీసర్ అవుతానని పట్టుబట్టాడు కుమార్.

కుమార్ ఆలోచనతో పృథ్వి రాజీపడక తప్పలేదు.

కుమార్ పోలీసు ఆఫీసరు కావడం బొత్తిగా ఇష్టంలేదు పృథ్వికి. ఈ విషయంలో ఇద్దరూ అనేకసార్లు ఘర్షణ పడాల్సి వచ్చింది. అయినా కుమార్ తన పట్టువిడిచి పెట్టలేదు.

కుమార్‌లో పట్టుదల ఎక్కువ. తాను అనుకున్నది సాధించేవరకు నిద్రపోడు.

ట్రైనింగ్ పూర్తి అయ్యాక పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చాయి కుమార్‌కి. మరో వారం లోగా తాను డ్యూటీ రిపోర్టు చెయ్యాలి. చెప్పలేని సంతోషంతో కుమార్ వూగిపోతున్నాడు. కానీ తాతగారిలో ఏమాత్రం ఆనందం లేకపోవడం చూచిన కుమార్ బాధపడ్డాడు.

''చూడు కుమార్! నువ్వు పెద్దవాడివైనావ్. స్వయంనిర్ణయాలు తీసుకోగల వయస్సొచ్చింది - కానీ... నా బాధల్లా...'' పృథ్వి కంటిలో నీరు తొణికిసలాడింది.

పెంచిన ప్రేమ కుమార్‌ని కుదిపేసింది.

''పోలీసు డిపార్టుమెంట్‌లో వుద్యోగం అంటే... కేవలం బాధ్యతతో కూడుకున్నది మాత్రమే కాదు! క్రమశిక్షణతో పాటు నువ్వు చెయ్యబోయే వుద్యోగంలో ప్రమాదాలు ఎదురయ్యే క్షణాలు కూడా వుంటాయి. తల్లీ తండ్రీ ప్రేమంటే ఏమిటో తెలీని నిన్ను ఎంతో ఆప్యాయంగా పెంచి పెద్దచేశాను. నీ భవిష్యత్ వుజ్వలంగా వుండాలని మనసారా కోరుకుంటున్నాను. అంతే బాబూ... అంతే...'' పృథ్వి కంఠం గాద్గదికమైంది.

''పిరికిమందు నూరిపొయ్యద్దు తాతయ్యా!...'' పృథ్వి బాహువుల్లో ఇమిడిపోయాడు కుమార్.

కుమార్ దృష్టి మొదట పిక్ పాకెట్‌ర్లమీద పడ్డది. తన పోలీస్టేషన్ పరిధిలో చెలామణిలో వున్న జేబుదొంగలందరినీ ఆరునెలలు తిరగకముందే ఏరిపారేశాడు.

రౌడీయిజాన్ని అణచివెయ్యాలన్నది కుమార్ తర్వాత ధ్యేయమైంది. 'రౌడి' అని చెప్పుకునే ప్రతివాడ్నీ లాఠీతో వుతికేశాడు. కొందర్ని బొక్కలో తోశాడు.

రౌడీల పాలిటి పక్కలో బల్లెమైనాడు కుమార్. వాళ్ళ గుండెల్లో నిద్రపోయాడు. పథకం ప్రకారం అందర్నీ మట్టుపెట్టాడు. రికమెండేషన్లను లక్ష్యపెట్టలేదు. నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం తన ప్రిన్స్‌పుల్‌గా పెట్టుకున్నాడు.

ఇటు ప్రజలలో అటు అధికార వర్గంలో సంవత్సరం తిరక్కముందే మంచి పేరు తెచ్చుకోగలిగాడు కుమార్.

కొత్తవాడైనప్పటికీ లా అండ్ ఆర్డర్ కాపాడినందుకు... ఉత్తమ కార్యనిర్వహణకు మెచ్చి ఆ సంవత్సరం అత్యుత్తమమైన సేవాపతకాన్ని డిపార్టుమెంట్ నుంచి పొందిన ఘనత కుమార్‌కే దిక్కింది.

పతకాన్ని పొందిన మధుర క్షణాల్లో కుమార్ పొందిన అనిర్వచనీయమైన ఆనందం అంతా ఇంతా కాదు! మనుమడి ఘనత, గొప్పతనం, దీక్షా దక్షతలు కళ్ళార చూస్తూ సంబరపడ్డాడు పృథ్వి.

కానీ... బాధలాంటి ముల్లు పృథ్వి హృదయంలో కలుక్కున గుచ్చుకుంది. ఈ ఆనందం శాశ్వతమా? అన్పించింది.

రెండేళ్ళు తిరక్కముందే ఓ మారు మూల ప్రదేశానికి కుమార్‌కి బదిలీ అయింది. ఏరికోరి డిపార్టుమెంట్ కుమార్‌వంటి వ్యక్తిని అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందని తెల్సుకున్నప్పుడు సంతోషించాడేగానీ బాధపడలేదు.

కానీ... పృథ్వి మనస్సు కకావికలమైంది.

''తాతయ్యా! నేవెడుతోంది విదేశాలకు కాదు. నెలకోసారి వచ్చి నిన్ను చూసి పోతుంటాను. బాధపడకు...''

కుమార్ ఓదార్పు మాటలు పృథ్విని తృప్తిపరచలేకపోయినయ్.

''చూడు కుమార్! కన్న కొడుకుని... ఈ ఇంట అడుగు పెట్టిన మహాలక్ష్మి వంటి కోడల్నీ దూరం చేసుకున్న దురదృష్టవంతుడ్ని - చివరికి కంటికి రెప్పలా పెంచి పెద్దచేసిన నువ్వుకూడా నా దగ్గరలేకుండా ఎక్కడితో వెళ్లిపోతున్నానంటే... బాధగా వుంది.''

పృథ్వి ముసలి ప్రాణం బావురుమంది.

''జీవిత చరమాంకంలో వున్న నేను... ఇప్పుడు నీక్కూడా దూరమై బతకలేను కుమార్!...'' భోరుమన్నాడు పృథ్వీ.

తాతగారికి కొండంత ధైర్యం నూరిపోసిన కుమార్ ఆరోజు రాత్రి బస్సులో ప్రయాణమైనాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ పృథ్విలో శక్తి సన్నగిల్లుతోంది. మనిషిలో ఇదివరకటి తృప్తి, సంతోషం కరువవుతున్నాయ్ - ప్రత్యేకమైన బాధ అంటూ ఏమి లేదు.

తనవారంటూ ఎవ్వరూ లేకుండా ఏకాకిగా కన్నుమయ్యాల్సి వస్తుదేమోననే దిగులు పురుగులా ప్రతిక్షణం తొలుస్తోంది పృథ్విని.

కడుపులో ఆకలివున్నా వేళకు తిండి సయించకుండాపోతోంది. ప్రతి నిత్యము ఎడతెగని ఆలోచన్లతో మానసికంగా శారీరకంగా కృంగి కృశించిపోక తప్పడం లేదు.

కంటినిండా నిద్రకూడా కరువైంది. ఇరవై నాలుగు గంటలూ కుమార్ గురించే ఆలోచన... కాదు-దిగులు!

అప్పుడే కుమార్ వెళ్ళి ఇరవై రోజులైంది! మరో పది రోజులు గడిస్తేనేగాని తనను చూడటానికి కుమార్ రాడు.

రాత్రి ఏడుగంటలు దాటింది. 'న్యూస్' వినాలని 'టి.వి' ఆన్ చేశాడు పృథ్వీ.

వార్తలు ప్రారంభమైనాయ్.

''ఇప్పుడే అందిన వార్త! సుబేదారి పోలీసుస్టేషన్ బాంబు దాడికి గురై, పేలిపోయిన కారణంగా... డ్యూటీలో వున్న పోలీసు ఇన్స్పెక్టర్ కుమార్‌తో సహా మరో నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మరణించారు.''

ఆశనిపాతంలాంటి వార్త వింటూ తన చెవులను తనే నమ్మలేక కుప్పకూలిపోయాడు పృథ్వీ. మరుక్షణంలో... ఆయన అంతిమ శ్వాస అనంతవాయువుల్లో కల్సిపోయింది.

---

★ *(20-12-92 ఆంధ్రభూమి దిన పత్రికలో ప్రచురితం)*